# కవితా! ఓ కవితా!!

**-తనికెళ్ళ భరణి**

అసుర సంధ్యవేళ!

అస్తమిస్తోన్న కాషాయవర్ణాన్ని కళ్ళతో పీలుస్తూ పడక్కుర్చీలో పసిపిల్లాడిలా కూర్చున్నారు దక్షిణామూర్తిగారు.

రొదపెట్టే మహాయంత్ర నగరాల్లో అంత నిశ్చలంగా కూర్చోడం మహాపురుషులకీ, మహాకవులకీ మాత్రమే చేతనవుతుందేమో.

దక్షిణామూర్తిగారు సన్నగా పొడుగ్గా ఆనందాన్నీ, విషాదాన్నీ సమాన స్థాయిలో వూదే జీవణ వేణువులా కనిపిస్తారు నాకు.

అందుకే ఆయిన్ని చూడగానే చెయ్యెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుంది.

ఆపనే చేశాను!

నన్ను చూసి బ్రహ్మానందపడిపోయారు ''అరే ఏవిటయ్యా సారధీ బొత్తిగా కనిపించడం మానేశావ్..అమ్మాయ్ గాయత్రీ సారధి వొచ్చాడు కాస్త కాఫీ పంపమ్మా..'' అంటూ హడావిడి చేశారు.

''ఇప్పుడు కాఫీ ఎందుకండీ?'' అన్నాను మొహమాట పడ్తూ.

''అదేవిటయ్యోయ్ కాఫీ వొద్దంటున్నావ్..నీ వ్యవహారం జూస్తే రాత్రికి ఇక్కడే తిష్టవేసేలా వున్నావ్..అలాటి శషబిషలు నా దగ్గర పనికిరావు...మా యింట్లో భోజనం ఎంతమాత్రం వీలుపడదు'' అన్నారు కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానుల్లాగ బిగ్గరగా నవ్వేస్తూ!

రోజుకి అధమపక్షం పదిసార్లయినా ఏదో సందర్భంలో కన్యాశుల్కం డైలాగులు వల్లించకపోతే ఆయినకి తోచదు.

గాయిత్రి కాఫీ తెచ్చింది.

''ఏవయ్యా సారధీ...ఇన్నాళ్ళకి కనపడ్డామా'' అంది నిష్టూరంగా

''ఎక్కడండీ వెధవ వుద్యోగం పొద్దునించీ రెక్కలు ముక్కలు చేసుకున్నా తృప్తివుండి ఛావదు మా బాస్‌గాడికి...సరే ఏ అర్ధరాత్రో అపరాత్రో రావడం ఇంత పిండాకుడు ఉడకేసుకోవడం..పడుకోవడం''



''నాన్నా సారధిని కూడా ఇవాళ భోజనానికి ఉండి పొమ్మనండి'' అంది.

''అబ్బే వొద్దండీ వెళ్ళిపోవాలి'' అన్నాను మనస్ఫూర్తిగానే.

''ఎక్కడికీ వెళ్ళేది!..ఇవాళ పుద్దు ఇక్కడే కాదని వెళ్తే కాళ్ళు విరగొడ్తా ''అని గాయిత్రికేసి తిరిగీ ''అమ్మా వాళ్లేరే?'' అని అడిగారు.

''కిరణా కొట్టుకెళ్ళారు నాన్నా...ఈపాటికి వొచ్చేస్తూ వుండాలి.''అని కాళీ కాఫీ గ్లాసులు లోపలికి తీసికెళ్ళింది.

''అయితే వాళ్ళొచ్చే వరకూ భోయిన యోగం లేదన్నమాట సరే సిగరెట్టైనా తగలేద్దాం......సారధీ ఆ టేబుల్‌మీద సిగరెట్ ప్యాకెట్టుందీ అందుకో''

సిగరెట్లు తీసుకొచ్చి ఇచ్చాను.

''కొత్తపుస్తకాలేం చదివావోయ్ ఈమధ్యా?'' అన్నారు సిగరెట్ దమ్ము గట్టిగా లాగి.

''ఎక్కడండీ న్యూస్‌పేపర్ చూడ్డానికి తీరిక దొరికి ఛావట్లేదు.''

''చాల్లేవోయ్ టైముండటం లేదని తినడం మానేశావా? కడుపుకి గడ్డిపడెయ్యటం ఎంతవ

"సుఖ్యమో బుర్రకి పుస్తకాలు అంతకన్నా ముఖ్యం..ఈమధ్య బైరాగి 'ఆగమగీతి' చదివా..చాలా నచ్చింది..ఒక్క ముక్కవిను!

జగతీవిష సారపాయి-సంతత శూలాగ్ర శాయి ట

సరిగ్గా మిడిల్ క్లాస్ ఫెలోకి చక్కని నిర్వ చనం..."

"మీరేమీ రాయలేదా ఈమధ్య?

"ఏవిటీ రాసేది గాడిదగుడ్డు...అయినా ఈమధ్య నాకో కొత్తజబ్బు మొదలైంది...నేనేది రాసినా నాకే నచ్చట్లేదు! అయినా ఈ కవితలూ..కళలూ....యావత్తు ఆర్ట్ యూస్‌లెస్ అని ఎప్పుడో అనేశాడుగా ఆస్కార్‌వైల్డ్!

"ఆమాట నేను ఒప్పుకోను" అన్నాను ఆయనతో అంత గట్టిగా మాట్లాడ్డం అదే ప్రథమం.

"అది ఆయన వుద్దేశం...అయినా వీటన్నిటికీ అతీతమైందయ్యా కళ...కళని ఉపయోగించుకోవడం అనేది వెర్రితనం...జీవితం నిండా కవిత్వం ఉంది...జీవితాన్ని కవితామయిం చేసుకోవాలి!...అంటే మనిషి మనిషి లాగ బ్రతగ్గలిగితే చాలు...ఎవడు ఏది చెప్పినా అంతే"

నేనేదో మాట్లాడబోయాను...అంతలో దూరం నుంచి కవిత, పల్లవీ వొచ్చారు. కాళీ సంచీలు వూపుకుంటూ నన్ను చూసి చిరునవ్వు నవ్వారు!

"ఏమయిందే" అన్నారు దక్షిణామూర్తిగారు.

బహూశా నేనక్కడున్నాననేమో ఏమీ చెప్పకుండా లోపలకెళ్ళిపోయింది కవిత.

"అది కాదు నాన్నా..కిరణా కొట్టువాడూ అరువివ్వనన్నాడు." అంది పల్లవి ఆయాసపడ్తూ.

అలాటిస్థితిలో నేనకడుండడం ఆయినకెల్లావుందో గానీ నాకు మాత్రం ఇబ్బందిగా వుంది.

తెగించి ఓ మాట అన్నాను..."మీరు మరోలా భావించకపోతే నాదగ్గర డబ్బుంది."

"ఏం పర్లేదోయ్..బావినిండా చల్లటి నీళ్ళున్నాయ్...కమ్మటి పచ్చిగాలి వుంది. ఓపూట ఋషుల సాంప్రదాయం పాటిద్దాం...చచ్చిపోముగా"

"మీరు నన్ను పరాయివాడిలా భావించొద్దు...పల్లవీ వెళ్లి సంచీ పట్రా"

పల్లవి లోపలికి పరిగెత్తింది.

దక్షిణామూర్తిగారు తనకేం పట్టనట్టు మరో సిగరెట్ వెలిగించారు.

లోపల్నించి పల్లవి ఏవేళకీ రాకపోయేసరికి నేనే లోపలికెళ్ళి...


ఎదురుగుండా కవిత కనిపించింది..

"ఆ సంచీ..లిస్టూ నాకియ్యి"

"ఎందుకూ?"

"వెళ్ళి సరుకులు తెస్తాను" అంటూ నేనే వెళ్లిచిలకొయ్యకున్న సంచీ తీసుకుని బైటపడ్డాను.

నాబుర్ర నిండా ఆలోచనలు..అరే ఏవిటీ మనిషి...అసలు సంసారం ఎల్లా గడుపుతున్నాడు..పెద్దపిల్ల ఒకత్తే సంపాయిస్తోంట..ఇలా ఎన్నాళ్లు...అంత మంది ఆడపిల్లలున్నా ఏ చింతా లేకుండా ఎలా వుండగలుగుతున్నాడు.




అయినా మహాకవికి ఇవి కష్టాలేవిటి?

కొట్టుకెళ్లి వారానికి సరపడ సరుకులు కొని రిక్షాలో వేసుకుని తెచ్చి పడేసా!

ఆయిన థాంక్స్ అనాలని నేను కోరుకోలేదు గానీ...కనీసం అంటే బావుణ్ణు అని ఎక్కడో అంతరాళిల్లో అనిపించింది.

అబ్బే అంత హాయిగానూ పడకుర్చీలో కూర్చున్నారు.

ఏదో పుస్తకం ముందేసుకుని.

గాయిత్రి గబగబా వొంట చేసింది.

ఆరుబయట వెన్నెల్లో చక్కగా భోజనాలు ముగించాం.

దక్షిణామూర్తిగారు 'కప్పుర భోగి వంటకము..."అంటూ శ్రీనాధుడి పద్యం చదివారు.

గాయిత్రి అన్నమాచార్య కీర్తన ఎత్తుకుంది..తందనానా అహీ..తందనానాబళీ..బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే

చల్లటి వాతావరణంలో ఆ పాటకి చుట్టూవున్న చెట్లు మత్తెక్కి వూగుతున్నట్టు అనిపించింది.

లేచి ఇంటికి బయల్దేరబోతోంటే

'అన్నదాతా సుఖీభవ' అన్నారాయన

నాకు మనస్సు చివుక్కు మనిపించింది.

★★★

నా ఆఫీసు గొడవల్లో పడి రెండు మూడు నెలల దాకా ఆయిన ఇంటికి పోలేదు. అప్పుడప్పుడూ పల్లవీ, కవితా స్కూళ్ళకి వెళ్తో రోడ్డు మీద కనిపించేవారు..

ఒక ఆదివారం వెళ్దామనిపించి పొద్దునే బైలుదేరా!

అక్కడికెళ్ళేసరికి నీళ్ళుతోడి మొక్కలకిపోస్తున్నారాయిన.

"రావోయ్..రా కులాసా!..అమ్మా కవితా సారధివొచ్చాడు. కాఫీ పంపూ!" అని కేకేశారు.

"కలుపుతున్నానాన్నా.." అని జవాబిచ్చింది కవిత

"అన్నట్టు నీకు చెప్పలేదు గదూ గాయిత్రి వెళ్లిపోయింది"

"వెళ్ళడమేమిటి?...ఎక్కడికీ"

"అదేనయ్యా వెళ్ళటం అంటే లేచిపోవడం...రుక్మిణీ కల్యాణం వంటిది.."

నాకు నోట మాట రాలేదు.

"పాపం! దానికీ ఈడొచ్చింది...నేనా ఈ జన్మకి దాని పెళ్ళి చెయ్యిలేనూ..మరి దానికీ కోరికలుంటాయ్. ఈ వయస్సులో మొగుడూ కావాలి. అంచేతే నచ్చినవాడితో వెళ్ళిపోయిందు." పక్కవాటాలో ఏదో సంఘటన జరిగినంత క్యాజువల్‌గా చెప్పారు.

ఓ సిగరెట్ వెలిగించి.." నా బాధల్లా లేచిపోయినందుకు కాదు. వాడు తిన్నగా దీంతో కాపరం చేస్తాడా లేక తీసికెళ్ళి ఏ బొంబాయిలోనే అమ్మేస్తాడా అనే బెంగా..అయితే మాత్రం మనం ఏం చెయ్యగలంలే..."

కవిత కాఫీ పట్టుకొచ్చింది.

యాంత్రికంగా అందుకుని తాగుతున్నా..

కళ్ళల్లో గాయిత్రి మెదిలింది...

ఇక్కడున్నప్పుడు అంతపట్టించుకోలేదు..ఎంత మంచిపిల్లా..అని మనసులో అనుకున్నాను.

ఇంక ఆ మనిషి కనపడ్డు అని తెలిశాక అభిమానం పెరగడం మనిషి సహజ లక్షణమేమో!

మళ్ళీ అంతలోనే అనిపించింది..ఎంత పనిచేసిందీ!...

ఎంత బరితెగించిందీ! అరె ఇంత కుటుంబాన్ని వొదిలిపెట్టి తన సుఖం తాను చూసుకుందా...స్వార్థం ఎంత పెరిగిపోయిందీ...అసలెంత అప్రదిష్టా! మిగతావాళ్ళకి పెళ్ళిళ్ళు అవుతాయా?

"ఏవిటయ్యా అంత ఆలోచనా గాయిత్రి గురించేనా..పోన్లే వెళ్ళిందేమో సుఖపడ్తుంది..ఇక్కడేవుండి రాత్రింబగళ్ళు చాకిరీయేగా...అసలది మంచిపిల్ల గనక ఇన్నాళ్ళైనా వుంది..నువ్వేం వర్రీగాకు."

చిత్రంగా అనిపించింది ఆయిన నాకు ధైర్యం చెప్పడం!

కాస్సేపు కబుర్లు విని ఇంటికొచ్చేసా!

రాత్రి నిద్రపడితే ఒట్టు..ఏ తెల్లారయూమో మగతగా నిద్రపట్టింది.

చిత్రమైన కల..దక్షిణామూర్తిగారి మెడ దగ్గర్నించీ మిగతా భాగం అంతా అస్థిపంజరం..పరమ వికృతంగా వుంది..చుట్టూ ఏడుస్తూ గాయిత్రీ, కవితా, పల్లవీ.....

బండి చక్రాలంత పెద్ద మంగళసూత్రాలు వొచ్చి అంతా పచ్చడయ్యేలా మీద పడ్డాయ్!

ఉలిక్కిపడి లేచాను.

ఛ...ఎంత భయంకరమైన కలా!

లేచి కూజావొంపుకుని గ్లాసుడు నీళ్ళు తాగా!

అంతలో నాకు మెరుపలాటి ఆలోచనొచ్చింది!

మనస్సు తేలికపడింది!

అవును అలా చేస్తే..ఎంత బావుంటుంది.

అసలిన్నాళ్ళు ఆ ఆలోచన రాకపోయినందుకు నన్ను

నేను తిట్టుకున్నాను.

అవును కవితను పెళ్ళి చేసుకుంటే!

ఎంత మధురమైన వూహ..

అవును ఎంతో సంతోషిస్తారాయిన...

మళ్ళీ కల చక్కని కల!

నాకు కావాల్సినటువంటి కల..

ప్రశాంతంగా ప్రవహిస్తున్న కాలవమీద మెల్లిగా తేలుతోన్న పడవ..చుట్టూ మామిడి చెట్లు...

తెప్పమీద నేనూ కవితా..ఇంకెవ్వరూ లేరు..

కవిత ఎంకిపాట పాడుతోంది

వెనకనించి వెళ్ళి చటుక్కున కళ్ళు మూసా..

వెనక్కి తిరిగి గట్టిగా కౌగలించుకుని నుదురుమీద ముద్దెట్టుకుంది మత్తుగా.

కవిత ఒంట్లోంచి గమ్మత్తైన పరిమళం.

నీలాల్లాంటి కళ్ళతో నావేపుచిత్రంగా చూస్తోంది.

ఎంత ఆనందం..ఎంతో సంతోషం..నా నరాలనిండా తేనెవాకలు ప్రవహిస్తోన్నట్టు..

ప్రపంచంలో సుందరమైనదీ...అసలు మనుషులు ఎందుకు పోట్లాడుకుంటారు...ఎవరో కవి చెప్పినట్టు ప్రేమించుకోక...

అలా కమ్మటి..రంగు రంగుల కలలు.

తెల్లారింది!

రేడియోలోంచి ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు వినిపిస్తున్నాయ్!

ఎంత హాయిలే హలా!

తప్పకుండా..ఇవాళ ఇప్పుడే వెళ్ళి ఆ అమ్మాయికి ఈ విషయం చెప్తే...కవిత కళ్ళల్లో ఎంత ఆనందం....

ఎంత సిగ్గు...

ఓహో చూడాలి...

ఆ ఇంటి చుట్టూ మామిడితోరణాలు...

మధుపర్కాలు...

మంగళ వాయిద్యాలు..

నేను వెళ్ళేసరికి బావిగట్టు మీద బట్టలు వుతుకుతోంది కవిత...

ఎంత అందంగా వుంటుంది కవిత..

ఎంత నాజూగ్గా..అచ్చం జానుతెనుగు పద్యంలా..

అసలామె మీద ఓ శృంగార ప్రబంధం రాసిపారెయ్యొచ్చు..


కాళిదాసుకీ ఇలాటి అమ్మాయే సాక్షాత్కరించి వుంటుంది.

లేకపోతే శాకుంతలం రాయిగలిగేవాడా!

అసలు ప్రేమలోంచేనేమో ఉత్తమ కవిత్వం పుట్టేది..

ఎంత మూర్ఖుణ్ణి ఇంత సౌందర్యాన్ని ఎన్నడూ పట్టించుకోలేదూ!

ఎంత మృదువైన మందహాసం..నందివర్ధనం పువ్వులా స్వచ్ఛంగా!




ఓహో కవితా! ఓ కవితా!!

''పిలిచారా!'' అంది కవిత బట్టలుతకడం ఆపి..

ఏవిటి ఈ వొణుకు ఎన్నడూ లేనిది..రోజూ చూసే కవితేగా...గుండె ఎంత వేగంగా కొట్టుకుంటోందీ..కొంపతీసి ఆగిపోయిందా?''

''ఏవిటండీ..ఎవిటీ అలా ఉన్నారీవేళ'' గమ్మత్తుగా నవ్వింది.

''నాన్నగారున్నారా?'' మాట పెగిలింది.

''లేరు. కొట్లోకెళ్ళారు''

''కొట్లోకెళ్ళారా? అన్నట్టు కవితా..నేనూ..అదే నాకూ కాసిన మంచినీళ్ళిస్తావా?''

కవిత నీళ్ళు తెచ్చిచ్చింది...అమృతభాండాన్ని తీసుకొచ్చిన జగన్మోహినిలా అనిపించింది!

గబగబా నీళ్ళు తాగేశాను.

''నాన్నగారు వారం రోజులుగా కిరణాకొట్లో పస్జెయ్యడానికి వెళ్తున్నారు!''

అలా కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయా!

''పనెందుకూ?''

''అదేవిటండీ..మేం బ్రతకొద్దూ..కోట్లోపద్దులు రాస్తున్నారు..''

''అహ అలాగా అయితే అక్కడికెళ్తే దొరుకుతారా..''

''ఆ''

''అయితే వొస్తా!'' గబగబా బైటపడ్డా..

ఛ...ఛ..వెధవది ఎన్నడూ లేనిది ఏవిటింత కంగారు.

ఇంతభయం..అయితే ప్రేమించడం కష్టమేనన్నమాట. అలా ఏదో ఆలోచిస్తో కిరణా షాపుకొచ్చా...

కొట్లో ఓ మూల కూర్చుని పద్దులు రాస్తోన్న దక్షిణామూర్తిగారిని చూస్తే జాలేసింది.

ఆంధ్రనైషదకర్త అంఘ్రియుగ్మములు..అప్రయత్నంగా శ్రీనాథుడు గుర్తుకొచ్చి కళ్ళు చెమర్చాయి...

నన్ను చూశారు!

''రావోయ్ రా''..అనలేదు.

మెల్లిగాలేచి యజమానితో ఏదో మాట్లాడి బైటకొచ్చారు. బహుశా పర్మిషన్ తీసుకున్నారేమో!

''ఊ....చెప్పవయ్యా సారథీ..మళ్ళీ దాస్యం మొదలైందీ...'' అన్నారు సిగరెట్ వెలిగించి..

ఎలా మొదలెట్టాలి!

''కాస్త కాఫీ తాగుదామా?''

''మహాప్రసాదం పద..అది పడకే బుర్ర సరిగ్గా పన్జెయ్యట్లేదు..''

ఇద్దరం హోటల్లోకి వెళ్ళాం...రెండు కాఫీ ఆర్డర్ చేశా!

''చూశావా గాయిత్రీ వెళ్లిపోవడంతో మళ్ళీ వుద్యోగం!''

నేను వింటున్నా...

''నాకిప్పుడు పద్దుల పుస్తకమే ఆధునిక మహాకావ్యంలా అనిపిస్తోంది''

ధైర్యం చేశా

''మీతో ఒక విషయం మాట్లాడాలి''

''చెప్పు''

''నేను..కవితని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నా''

కాఫీవొచ్చింది!

ఇద్దరం మౌనంగా తాగేశాం.

మరో సిగరెట్ వెలిగించారు.

''గాయిత్రి నాకో చక్కని పాఠం నేర్పింది..కవులు స్వప్నాల్లోనే జీవించడం మంచిదికాదని...అందుకే మళ్ళీ పని మొదలెట్టా..నువ్వు మంచివాడివే కానీ కవివి..అంచేత కవితని నీకు ఇవ్వటం నాకిష్టంలేదు..క్షమించు..''

నేనేం మాట్లాడగలను!

★



## నేను సన్నబడ్డానోచ్!

ఆమధ్య అందరిచేతా తెగ లావైపోయింది అని అనిపించుకున్న రవళి 'నేనసలు అంత లావైపోయింది ఎప్పుడూ లేదు, ఎవరో కొంతమంది పని గట్టుకుని చేసిన ప్రచారం మాత్రమే ఇది' అంటూ సెలవిచ్చిందీమధ్య. లావుగా వుందనేది ప్రచారం చేయడమేంటి? అందరి కళ్లకీ ఎవరైనా లావా? సన్నమా అన్నది కనిపిస్తుందిగా! ఆమాటలా వుంటే -తెలుగులో అంతగా బిజీగా లేకపోయినా తమిళ, కన్నడ చిత్రాల్లో బోల్డు చాన్సులతో బిజీగా వున్నాను కదా, ఇంకేం కావాలి అంటూ తెలుగులో తనకి సినిమాలు తగ్గిపోయాయనే మాటని ఒప్పుకోకుండా తగిన చాన్స్ తెలుగులో రావాలేగాని విజృంభిస్తాను అంటోంది రవళి.

ఆల్ ది బెస్ట్!

-జె.ఎం.